

**స్టార్ ఆఫ్ ఇండియాగా తేజేష్**
నగరికి చెందిన తేజేష్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు పొందాడు. - 8లో



**ఘాట్‌లో ప్రమాదాలకు అడ్డుకట్ట**
మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు రాష్ట్ర రోడ్డు సేఫ్టీ సలహాదారు బాలాజీ పలు సూచనలు చేశారు. - 8లో



**దర్జాగా భూకబ్జా**
చిత్తూరులోని ఇరువారం సమీపంలో పేదలు కొనుగోలు చేసిన ప్లాట్లను కూటమి నేతలు ఆక్రమణకు యత్నిస్తున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో అక్టోబర్ 1వ తేదీన పింఛన్ల పంపిణీ చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. ఆయన ఆదివారం పలు శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. రెండవ తేదీ గాంధీ జయంతి సెలవురోజు కావడంతో పింఛన్ల పంపిణీ ఉండదని, మూడో తేదీన యథావిధిగా నగదు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 2,69,677 మందికి రూ.113.77 కోట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒకటవ తేదీ ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని జిల్లా, మండల, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఫించన్‌ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

### నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చిత్తూరులోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పోలీసు కార్యాలయంలో..**

**చిత్తూరు అర్బన్:** చిత్తూరులోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ప్రజలు నేరుగా తనను కలిసి సమస్యలపై మాట్లాడొచ్చని పేర్కొన్నారు. వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

### గణిత సాధనలు అభినందనీయం



జోనల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యార్థులు చిన్న వయస్సులోనే చురుగ్గా గణిత సాధనలు చేయడం అభినందనీయమని తమిళనాడు రాష్ట్రం వేలూరు విట్ యూనివర్సిటీ ఫౌండర్, చాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం సిప్ అకాడమీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో అబాకస్ జోనల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అబాకస్ సాధనతో పిల్లల్లో మేథో సంపత్తి పెరుగుతుందన్నారు. సిప్ అబాకస్ సంస్థ డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ తీసుకునే ప్రతి విద్యార్థి భవిష్యత్ బాధ్యత తమదేనన్నారు. విలువలతో కూడిన శిక్షణ, పిల్లల మేధస్సు పెంపొందించే ఒక యాగం అబాకస్ అని అన్నారు. ఈ పోటీల్లో 480 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 11 స్థాయిలను పూర్తి చేసి ప్రతిభ చాటిన విద్యార్థులకు కాన్వొకేషన్ పట్టాలు, జోనల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిప్ అకాడమీ తమిళనాడుకు చెందిన నిర్వాహకులు రవిశంకర్, శ్రీరామ్, ఆంధ్రాకు చెందిన గోపాల్, తిరుపతి కో ఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# అయోమయం!

పేదల సంపాదనలో విద్య, వైద్యానికే ఎక్కువ భాగం ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించాలని భావించింది. ఇందులో భాగంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. వైద్య, ఆరోగ్య శాఖను పటిష్టం చేసింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసుకువచ్చింది. గ్రామ సచివాయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎం (జనరల్ మెడిసిన్ అండ్ మిడ్‌వైఫరీ) రెండేళ్ల శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసింది. ప్రస్తుతం వారు శిక్షణ పూర్తి చేసుకుని రిలీవ్ అయ్యారు. ఉద్యోగోన్నతి కల్పించకుండా యథావిధిగా మాతృ స్థానాల్లో చేరాలన్న కూటమి ప్రభుత్వ ఉత్తర్వులతో అయోమయంలో పడ్డారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలు (ఫైల్)

- రెండేళ్ల క్రితం జీఎన్‌ఎం శిక్షణ కోసం ఏఎన్‌ఎంల ఎంపిక
- ఆపై శిక్షణ ఆరునెలల పొడిగింపు
- ఇటీవల శిక్షణ పూర్తి.. పాత స్థానంలోనే పోస్టింగ్
- ఆందోళనలో 198 మంది ఏఎన్‌ఎంలు

**కాణిపాకం :** చిత్తూరు, తిరుపతి జిల్లాలతోపాటు మదనపల్లిలో 1,312 వార్డు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో అర్హత, ఆసక్తి కలిగిన 198 మంది ఏఎన్‌ఎంలను, జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందేందుకు ఎంపిక చేశారు. 2021 ఏప్రిల్ ఒకటో తేదీన శిక్షణ ప్రారంభమైంది. చిత్తూరు, మదనపల్లి, తిరుపతి జిల్లా ఆస్పత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ ఖర్చుతో రెండేళ్ల జీఎన్‌ఎం శిక్షణను పూర్తి చేసుకున్నారు. 2023 మార్చి 31 నాటికి శిక్షణ పూర్తయింది. అప్పటికే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జీఎన్‌ఎం శిక్షణ గడువును మూడు నెలలు పొడిగించారు. అది కూడా ఆగస్టు నెలతో పూర్తయింది. దీంతో 27 నెలల పాటు శిక్షణ పొందుతూ సేవలను అందించిన ఏఎన్‌ఎంలు తమకు పదోన్నతి కల్పిస్తారనే ఆశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఏఎన్‌ఎం విధుల గురించి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ ప్రభుత్వం విధి విధానాలను జారీ చేసింది. జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలందరూ గతంలో పనిచేసిన గ్రామ సచివాలయాలకు వెళ్లి పూర్వపు బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జీఎన్‌ఎం శిక్షణతో పాటు రాత పరీక్షలు పూర్తయి త్వరలో సర్టిఫికెట్లు కూడా రానున్నాయి. ఆపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఏఎన్‌ఎంలు అయోమయంలో పడ్డారు.

### పీహెచ్‌సీలో పనులు

జీఎన్‌ఎం పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలను మాతృస్థానాలకు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొంతమంది ఏఎన్‌ఎంలను పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులుగా వాడుకుంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద ముగ్గురు స్టాఫ్ నర్సులు పనిచేస్తున్నారు. జీఎన్‌ఎం పూర్తి చేసిన ఏఎన్‌ఎంలను పలుచోట్ల డాక్టర్లు పీహెచ్‌సీల్లో పనులు చేయించుకుంటున్నారు. నైట్ డ్యూటీలు వేస్తామని భయపెడుతున్నారు. అక్కడ యథావిధిగా పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను కుర్చీలకు పరిమితం చేశారు. దీంతో పీహెచ్‌సీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక పల్లె, పట్టణం తేడా లేకుండా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏఎన్‌ఎంలను పీహెచ్‌సీలకు పరిమితం చేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### ఆందోళనలో వైద్య సిబ్బంది

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 27 నెలల పాటు తీవ్రంగా శ్రమించి వ్యయ ప్రయాసలకోర్చి జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందినా మళ్లీ గ్రామ సచివాయాలకే పరిమితం చేయడంపై ఏఎన్‌ఎంలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. శిక్షణ పూర్తి చేసుకున్న రెండేళ్ల తరువాత జీఎన్‌ఎంగా పోస్టింగ్‌కు అవకాశం కల్పిస్తామని ఎంపిక సమయంలోనే అప్పటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హామీ ఇచ్చారని చెబుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.



వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలు

**తిరుపతి, చిత్తూరు జిల్లా వివరాలు..**

- సచివాలయాల సంఖ్య 1312
- మొత్తం ఏఎన్‌ఎంలు 2,566 మంది
- శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు 198 మంది
- శిక్షణ కాలం 2 సంవత్సరాలు
- పొడిగింపు కాలం 6 నెలలు
- పీహెచ్‌సీల సంఖ్య 104

### హామీలో స్పష్టత ఏదీ

జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. వారు సచివాయాల్లో మాతృ స్థానాల్లోనే విధులు నిర్వహించేలా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నాలుగు రోజుల క్రితం రిలీవ్ ఆర్డర్లు తీసుకుని సత్వరమే ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే రిపోర్టు చేసి సంబంధిత గ్రామ సచివాయాల్లో బాధ్యతలు స్వీకరించాలని పేర్కొంది. దీంతో రెండేళ్ల నుంచి అహర్నిశలు శ్రమించి శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు మళ్లీ గ్రామస్థాయిలో అదే సేవలను అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా ఇప్పటికే జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హడావుడిగా గ్రామ సచివాలయాల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దానికనుగుణంగా పోస్టింగ్ ఇచ్చేందుకు వైద్యాధికారులు మార్గం సుగమం చేశారు.

### రూ.11 లక్షల జరిమానా కట్టాలంట

"నా శిక్షణా కాలం పూర్తయింది. ఆరు నెలలు పొడిగించారు. నా కుమార్తె అనారోగ్యం కారణంగా పొడిగింపు కాలంలో ఒక నెల ముందు రిలీవ్ అయ్యాను. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. స్పందనలో అర్జీ పెడితే అధికారులు సానుకూలంగా స్పందించి న్యాయం చేశారు. నెల రోజుల ముందు రిలీవ్ అయిన విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాను. మూవ్‌మెంట్ ఆర్డర్‌ను సాకుగా చూపించి చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని కొందరు రూ.11 లక్షలు జరిమానా కట్టమంటున్నారు. నా కుమార్తె ఆస్పత్రిలో మంచంపై ఉంది. ఇలాంటి సమయంలో రూ.11 లక్షలు జరిమానా పేరుతో అడగడంతో దిక్కు తోచడం లేదు. జిల్లా అధికారులే నాకు న్యాయం చేయాలి. నా ఉద్యోగానికి భద్రత కల్పించాలి.

– విజయలక్ష్మి, మదనపల్లి



# జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

**పుత్తూరు:** వడమాలపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్లను ఎంపిక చేశారు. అండర్–14 బాల బాలికల ఫ్రీ స్టయిల్, అండర్–17 బాలుర గ్రికో రోమన్ రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వీటిని జిల్లా ఎస్‌జీఎస్ సెక్రటరీ బాబు, హెచ్‌ఎం కరుణానవనీతం పర్యవేక్షించారు. జిల్లా నలుమూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. పీడీలు చంద్రశేఖర్‌రాజు, రవి, జయప్రకాష్, గుర్రప్ప, ప్రసన్నలక్ష్మి, పుష్పవాణి, రెజ్లింగ్ కోచ్ హిందూజ క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 3న కృష్ణా జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎస్ సెక్రటరీ బాబు తెలిపారు.

**అండర్–14 బాలికల జట్టు:** శ్రీవల్లి, భార్గవి, శైలజ, యశస్వీ, వర్తిత, దీపిక (రేణిగుంట), గీతిక, గుణశ్రీ (వడమాలపేట), జ్యోతిర్మయి, ప్రణీత (ఎంజీఎం తిరుపతి).

**అండర్–14 బాలుర జట్టు:** దేవేంద్ర, షణ్ముగం, యోగేశ్వర్ (వడమాలపేట), హర్షవర్ధన్, నాగరాజు (పల్లం), పవన్, హుసేన్, గిరిబాబు, సైపుల్లా (యాదమరి), సంతోష్ (ఎంజీఎం తిరుపతి).

**అండర్–17 బాలుర జట్టు:** భానుప్రకాష్, సతీష్, విగ్నేష్, సంతోష్, ఉదయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, అనీష్ (వడమాలపేట), సూర్యమోహాచారి (పల్లం), హర్షద్ (ఎంజీఎం తిరుపతి).



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

# శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు



స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

**పుత్తూరు:** వడమాలపేట మండలం అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. వేకువజామున సుప్రభాతంతో శ్రీవారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల సేవ, అర్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు బృందం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టు, ఉత్సవర్లు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవార్లు, జయవిజయులు, గరుడాళ్వార్, ఆంజనేయ స్వామి, ధ్వజ స్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

### పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో చివరి రోజు సోమవారం ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేస్తారు. 11.30 గంటల నుంచి 12.30 మధ్య స్వామి, అమ్మవార్లకు మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నారు.

# సర్కారువారి కిక్కు!

కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దయ్యాయి. ప్రైవేట్ ఆధ్వర్యంలో నడిచే దుకాణాలు ఏర్పాటుకానున్నాయి. ఈ మేరకు వారంలో కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే పట్టణాల్లో సిట్టింగ్ రూముల కోసం అన్వేషణ ప్రారంభమైంది. పేరుకు ప్రైవేటు మద్యం దుకాణాలే తప్ప.. అమ్మకాలు, సిట్టింగ్ రూమ్‌లు, బెల్టు దుకాణాలు అన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే సాగనున్నాయి. అంతేగాక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు పెట్టి మద్యం విక్రయాలు పెంచుకోవాలని ఇప్పటి నుంచే నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు సమాచారం.

- అన్నీ సిద్ధం.. పాలసీ ప్రకటనే తరువాయి
- ఈ వారంలో కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 270 దుకాణాలు..?
- పట్టణాల్లో సిట్టింగ్ రూముల కోసం అన్వేషణ
- ఇక గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బందికి రిక్తహస్తం

**చిత్తూరు అర్బన్ :** నూతన ప్రైవేటు మద్యం దుకాణాలకు సంబంధించిన పాలసీ నోటిఫికేషన్ ఈ వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించిన తరువాత చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. చిత్తూరు, తిరుపతి రెండు జిల్లాలకు కలిపి ఈ సారి 270 వరకు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. ప్రాథమికంగా ఈ రెండు జిల్లాల్లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ప్రాతిపదికన మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రైవేటు దుకాణాల ఏర్పాటు, మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న జిల్లాలోని వెయ్యి మంది నిరుద్యోగులు రోడ్డున పడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక కల్లుగీత కార్మికులకు దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో దాన్ని అమలుకు మతలబు పెట్టినట్లు తెలుస్తోంది. కల్లుగీత కార్మికులకు సర్కిళ్ల వారీగా ఉన్న దుకాణాల్లో రిజర్వేషన్ ఇవ్వకూడదని, జిల్లా యూనిట్‌గా తీసుకుని జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దుకాణాలు ఇస్తే భవిష్యత్తులో ఓటు బ్యాంకు నిలబడుతుందనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.





### ఎక్సైజ్ శాఖలో సర్వం సిద్ధం

కొత్త మద్యం పాలసీ నోటిఫికేషన్ ఇవ్వడానికి ముందే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెబ్‌ను రద్దుచేసింది. ఆ స్థానంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖను పునర్వ్యవస్థీకరించింది. ఇప్పటికే చిత్తూరు కేంద్రంగా ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ హోదాలో అధికారిని నియమించింది. ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పరిపాలన వ్యవహారాలు చూడాల్సి ఉంది. ఈ కార్యాలయానికి 17 మంది సిబ్బందిని కేటాయించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోసం చిత్తూరు కేంద్రంగా అసిస్టెంట్ కమిషనర్ పోస్టును క్రియేట్ చేశారు. ఆయన కూడా రెండు జిల్లాల బాధ్యతను చూసుకుంటారు. డిస్టలరీల పర్యవేక్షణకు తిరుపతి కేంద్రంగా అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించారు. ఆ పోస్టు పరిధిని నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, కర్నూలు, కడప, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు విస్తరించారు. అలాగే చిత్తూరు, గూడూరు, తిరుపతి కేంద్రాలుగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయాలు.. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. తడ సమీపంలోని బీవీ.పాలెం, చిత్తూరులోని ఎన్‌ఆర్.పేట, పలమనేరులోని వి.కోటల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

### రూముల కోసం అన్వేషణ

మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటికే నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను అద్దెకు తీసుకోవడానికి భవన యజమానులకు పలువురు అడ్వాన్సులు కూడా ఇచ్చేసారు. దుకాణాల పక్కనే మద్యం తాగడానికి సిట్టింగ్ గదులను చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఈ పరిస్థితిలేదు. అలాగే గ్రామాల్లో కిరాణా దుకాణాల నుంచి టైలర్ దుకాణం వరకు పలువురు టీడీపీ నేతలకు ఉపాధి కల్పిస్తూ బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు కానున్నాయి. ఇళ్ల వద్దకే మద్యాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంచడమే బెల్టు దుకాణాల లక్ష్యంగా కూటమి నేతలు ముందుకు సాగనున్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

**చిత్తూరు కలెక్టరేట్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ తెలిపారు. చిత్తూరు నగరంలోని మెసానికల్ మైదానంలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ క్రీడా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, పరుగు పందెం, క్యారమ్స్, చదరంగం పోటీలు చేపట్టారు. వీటిని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయులు పలు క్రీడల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ క్రీడల వల్ల టీచర్లు ఆరోగ్యంగా ఉండి పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తారని తెలిపారు. అంతేగాక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సిరాజుద్దీన్, దీనావతి, రెడ్డెప్ప, ఏకాంబరం, వంశీకృష్ణ, ఎస్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న టీచర్లు



జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన యూటీఎఫ్ సంఘం నాయకులు

## క్లుప్తంగా

### శిఖండి సినిమాను ఆదరించండి



శిఖండి ఆడియోను ఆవిష్కరిస్తున్న చిత్ర దర్శక, నిర్మాత కోడి కిషోర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తూ చిత్రీకరించిన శిఖండి సినిమాను చిత్తూరు ప్రజలు ఆదరించాలని చిత్ర దర్శక, నిర్మాత కోడి కిషోర్ కోరారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి శిఖండి సినిమా ఆడియోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరులోని పలువురు వ్యక్తులను నటీనటులుగా ఎంపిక చేసి ఈ చిత్రాన్ని చిత్రీకరించామన్నారు. ఇందులో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే హాని, ప్రభావాన్ని వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కఠారి హేమలత, దాత పార్థసారథి నాయుడు, నటీనటులు చంద్ర, శ్రీనివాసులు, మురగ, నాగ్‌కుమార్, ఫిరోజ్, రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగోన్నతులెప్పుడో?



మాట్లాడుతున్న భాషా పండితుడు స్వామినాథ్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా డీఈఓ పూల్‌లో ఉన్న తెలుగు, హిందీ టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని భాషాపండితులు స్వామినాథ్ డిమాండ్ చేశారు. డీఈఓ పూల్‌లో ఉన్న భాషా పండితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం ఓ ప్రైవేట్ కళాశాలలో సమావేశమయ్యారు. స్వామినాథ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమకు అన్యాయం జరుగుతోందన్నారు. కేడర్, ఉద్యోగోన్నతులు లేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. జీఓ 91 ప్రకారం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమల్‌నాథ్, కిరణ్‌కుమార్, సభాపతి, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా భూకబ్జా



ఇరువారం వద్ద కూటమి నాయకులు కబ్జా చేసిన స్థలం

- 54 ప్లాట్ల ఆక్రమణకు పథకం
- ఆక్రమణ వెనుక కాజూరుకు చెందిన టీడీపీ నేత హస్తం
- కష్టపడిన సొమ్ముతో కొనుగోలు చేశామంటున్న బాధితులు
- మంత్రి లోకేష్, కలెక్టర్‌కు విన్నవించినా లాభం లేదని ఆవేదన

చిత్తూరు కలెక్టరేట్ : సొంత ఇంటిలో ఉండాలన్నది అందరి కల. చిత్తూరులోని ఇరువారంతోపాటు పలు ప్రాంతాలకు చెందిన 54 మంది పేదలు కూలి పనులు చేసి పైసా పైసా కూడబెట్టి ఇరువారం వద్ద పోతంబట్టు గ్రామానికి వెళ్లే దారిలో సర్వే నంబర్లు 263, 263-4, 266-1లో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఏళ్లు గడిచినా ఇళ్లు నిర్మించుకునేందుకు స్తోమత లేక స్థలాలను అలాగే పెట్టుకున్నారు. 2024 మేనెల వరకు వారికి ఎలాంటి సమస్యా తలెత్తలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి కష్టాలు మొదలయ్యాయి. చిత్తూరు నగరానికి సమీపంలోనే ఆ స్థలాలు ఉండడంతో విలువ భారీగా పెరిగింది. దీంతో వాటిపై కూటమి అధికారం అండతో కూటమి నాయకులు పేట్రేగిపోతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. వారి కన్ను పేదలు కూలి పనులు చేసుకుని పైసా పైసా కూడబెట్టుకుని కొనుగోలు చేసిన స్థలంపై పడింది. రూ.లక్షల విలువ చేస్తుండడంతో ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. భయపెట్టి తాము చెప్పిన ధరకు విక్రయించాలని బెదిరింపులకు దిగుతున్నారు. కబ్జాదారుల నుంచి తమ స్థలాలను కాపాడాలని మంత్రి లోకేష్, కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు. దీంతో వారు జిల్లా కేంద్రమైన చిత్తూరులోని ఇరువారం ఐటీసీఎల్ వసతి భవనాల పక్కన పోతంబట్టు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న లేఔట్ ఆదివారం ధర్నా చేశారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నారు.

ఇరువారం పోతంబట్టు గ్రామం వద్ద 54 మంది నేతల కన్ను పడింది. కష్టార్జితంతో కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించుకునేందుకు కాజూరుకు చెందిన పేరొందిన టీడీపీ నాయకుడు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు చేసిన ప్లాట్‌లలో అక్రమంగా గోడ నిర్మించి కబ్జాకు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తప్పుడు పత్రాలు సృష్టించి..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కబ్జారాయుళ్ల ఆగడాలు శ్రుతిమించాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు దాని పూర్వ వివరాలు సేకరించి, హద్దులు మార్పించి, సంవత్సరాల క్రితమే కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. స్థల యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంతేకాకుండా కబ్జా చేసిన భూములను అమ్మకానికి పెట్టి లక్షల్లో అడ్వాన్సులు తీసుకుంటున్నారు. అసలు విషయం బయటకు వచ్చాక ఇటు అసలు భూ యజమానులు, అటు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు.

**మంత్రి లోకేష్‌కు చెప్పినా స్పందన లేదు...**

కబ్జాకు గురైన 54 మంది బాధితులు ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి లోకేష్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. స్థలాల కబ్జా విషయాన్ని చెప్పి కన్నీరుమున్నీరయ్యారు. అదే విధంగా వారం క్రితం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఇటు మంత్రి నుంచి కానీ, కలెక్టరేట్ అధికారుల నుంచి బాధితులకు ఎలాంటి హామీ అందలేదు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భయాందోళనకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

**లోన్ తీసుకుని ప్లాట్ కొన్నామయ్యా**



ప్రైవేట్ సంస్థలో లోన్ తీసుకుని పిల్లల భవిష్యత్ కోసమని ఇరువారం వద్ద ప్లాట్ కొనుగోలు చేశామయ్యా. తీసుకున్న లోన్ ప్రస్తుతం అధికంగా వడ్డీ అయ్యింది. ఆ రుణం కట్టలేక నా కూతురు ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. మేము దళితులము. కష్టపడి కొనుగోలు చేసిన మా స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అడిగినందుకు భయపెడుతున్నారు. సీఎం, కలెక్టర్ మాకు న్యాయం చేయాలి.

- మేరి, బాధితురాలు, చిత్తూరు

**ఆరేళ్ల క్రితం కొనుగోలు చేశాం**



ఇరువారం పోతంబట్టుకు వెళ్లేదారిలో పీహెచ్ కాలనీ వద్ద ప్లాట్‌ను ఆరేళ్ల క్రితం మానాయన కొనుగోలు చేశారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు మా వద్ద ఉన్నాయి. ఇటీవల మా ప్లాట్ల వద్ద కాంపౌండ్ వాల్ నిర్మించారు. ఎందుకని అడిగితే స్థలం మొత్తం కొనుగోలు చేశామని చెబుతున్నారు. కాల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాం. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

- పురుషోత్తం, బాధితుడు, చిత్తూరు

# స్టార్ ఆఫ్ ఇండియాగా తేజేష్

- జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో విజేతగా రాష్ట్ర బాలుర జట్టు
- రెండో స్థానంలో బాలికల జట్టు



జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు

నగరి: హర్యానా రాష్ట్రం రోహతక్ సైనిక్ స్కూల్‌లో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రాజట్టు విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ ఆదివారం వివరాలు వెల్లడించారు. బాలికల జట్టు రెండో స్థానం నిలిచిందని, డబుల్స్, మిక్సుడు డబుల్స్ పోటీల్లోను రాష్ట్ర జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. 14 రాష్ట్రాల జట్లు పాల్గొన్న ఈ పోటీల ఫైనల్‌లో ఆంధ్ర, తమిళనాడు జట్లకు హోరాహోరీగా మ్యాచ్ జరిగిందని, రాష్ట్ర జట్టు విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా సారథ్యం వహించిన నగరికి చెందిన కేసీ తేజేష్ అన్ని పోటీల్లోను ఉత్తమ ప్రతిభ చూపి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్నాడని తెలిపారు. జట్టు క్రీడాకారులను రాష్ట్ర బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరావ్, టీం మేనేజర్ సూరిబాబు అభినందించారు. కోచ్ రాజు, జిల్లా అసోసియేషన్ చైర్మన్ జగన్నాథ నాయుడు, అధ్యక్షుడు వెంకటస్వామి, నగరి బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రవిబాబు, అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నిజాముద్దీన్ కోచ్‌లు టి.గోపి, జయచంద్ర పాల్గొన్నారు.

# మొగిలి ఘాట్‌లో ప్రమాదాలకు అడ్డుకట్ట

- మూడు ట్రయలింగ్స్, రేడియం లైట్ల ఏర్పాటు
- డివైడర్ల వద్ద రైల్వే తండువాలు
- రోడ్డు సేఫ్టీ రాష్ట్ర సలహాదారు బాలాజీ



ఘాట్‌లో వేగ నియంత్రణ వాహనాల పరీక్ష

పలమనేరు: పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్‌లో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి నివారణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర రోడ్డు భద్రత ప్రభుత్వ సలహాదారు బాలాజీ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి ఘాట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొగిలి ఘాట్‌లో వాహనాల అధిక వేగం, డ్రైవర్లు పరిస్థితులను గమనించకపోవడం, వేగ నియంత్రణలు లేకపోవడం, ఈ ఘాట్‌పై డ్రైవర్లకు అవగాహన లేకపోవడం ప్రమాదాలకు ప్రాథమిక కారణాలుగా గుర్తించామన్నారు. ఈ క్రమంలో మొగిలి ఘాట్‌లో వేగాన్ని తగ్గించేలా మూడు రకాల మోడళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు డెడ్లీ యాక్సిడెంట్ జోన్ అనే విషయం డ్రైవర్లకు తెలిసేలా ఎల్‌ఈడీ లైట్లు, సోలార్ ఆటోమేటిక్ లైట్లు, మూడు రకాల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు డివైడర్ల ఎత్తు తక్కువగా ఉండడంతో మలుపుల్లో రైల్వే తండువాలను ఫైన్సింగ్‌గా మూడు వరుసల్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఏనుగులు రోడ్డు దాటుతుంటాయని, డ్రైవర్లు వేగాన్ని తగ్గించుకోవాలనే సూచిక బోర్డులను పెట్టాలని తెలిపారు. రోడ్డుకి ఇరువైపులా సోలార్ బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాలను శాశ్వతంగా నివారించాలంటే మలుపులను నేరుగా మార్చాలన్నారు. ఈ పనులకు నిధుల సమస్య ఆటంకిగా ఉన్న కారణంగా తాత్కాలికంగా ప్రమాదాల నివారణకు పలు సలహాలు, సూచనలు చేసినట్టు పేర్కొన్నారు.

**పనులు చేపట్టకపోతే ఎన్‌హెచ్ అధికారులపై కోర్టులో కేసు**

మొగిలి ఘాట్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తాను సుప్రీం కోర్టుకు విన్నవించడంతోనే విచారణ మొదలైందని రాష్ట్ర రోడ్డు భద్రత సలహాదారు బాలాజీ తెలిపారు. ఇక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణం ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. వీరిపై తాను ఉన్నత న్యాయస్థానంలో కేసు పెట్టడం ఖాయమని తెలిపారు. పలమనేరు పట్టణ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ మార్గంలో వెళ్లే వాహనాల వేగాన్ని అదుపులోకి తీసుకురావడం ద్వారా ఘాట్‌లో ప్రమాదాలు జరక్కుండా చూసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంవీఐ రాజేశ్వరరావు, ఎన్‌హెచ్ కన్సల్టెంట్ సత్యనారాయణ, బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు, పలమనేరు ఆర్టీసీ డీఎం టీకే స్వామి తదితరులు పాల్గొన్నారు.



## త్రుటిలో తప్పిన ప్రమాదం

- మారుతి వ్యాను ముందు, వెనుక ఢీకొన్న ట్రాక్టర్, మరో కారు
- ఎవరికీ ఎలాంటి గాయాలు కాని వైనం
- బోయకొండ గంగమ్మే కాపాడిందన్న కర్ణాటక భక్తులు



దెబ్బతిన్న మారుతి వ్యాను

పుంగనూరు: పట్టణంలో ని తేజ ఆస్పత్రి వద్ద ఆదివారం రాత్రి మారుతి వ్యానును ట్రాక్టర్ ఢీకొంది. త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. బోయకొండ గంగమ్మే మమ్మల్ని కాపాడిందని కర్ణాటకకు చెందిన భక్తులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటకకు చెందిన కృష్ణమూర్తి, విశ్వనాథ్, అరుణ్ కుటుంబ సభ్యులతో కలిసి బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి పుంగనూరులోని తేజ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో రాళ్ల లోడుతో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. అదే వ్యానును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. భక్తులకు ఎవరికీ గాయాలు కాలేదు. అమ్మవారి దయతోనే తాము బయట పడ్డామని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీ అగ్రికల్చర్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా అంజయ్య

చిత్తూరు అగ్రికల్చర్: ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిత్తూరు నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా రాజీవ్, ఉపాధ్యక్షులుగా దాము, సురేష్‌కుమార్, చంద్రశేఖర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా బాలమురుగన్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా లక్ష్మీప్రసాద్, లత, సహాయ కార్యదర్శులుగా శంకర్, కుమార్, అస్లాంబాషా, భానుప్రియ, కోశాధికారిగా ఎం.సాయి చరణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్‌వీ ప్రసాద్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి రవిప్రకాష్ రావు ప్రకటించారు.

## విద్యుత్ బిల్లుల ద్వారా రూ.1.56 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం సెలవు దినమైనా విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలను అందుబాటులో ఉంచారు. 16,500 మంది బిల్లులు చెల్లించారని, రూ.1.56 కోట్లు వసూలైనట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

## వీధి కుక్కల దాడిలో మేక మృతి

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్.పేటకు చెందిన రహమత్ మేకను ఆదివారం వీధి కుక్కలు కరిచి చంపేశాయి. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయాడు. పలు ప్రాంతాల్లో కుక్కలు దాడిలో ప్రజలు గాయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చిత్తూరులో విద్యుత్ జిల్లా కార్యాలయం

- కొత్త కార్యాలయం ఏర్పాటుకు అడుగులు
- 55 పోస్టుల సర్దుబాటుతో బేజారు
- ఉద్యోగులపై మరింత పనిభారం



చిత్తూరులోని విద్యుత్ శాఖ అర్బన్ డివిజన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో చిత్తూరులో సర్కిల్ (జిల్లా) కార్యాలయం ఏర్పాటు కానుంది. ప్రస్తుతం తిరుపతి కేంద్రంగా పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. చిత్తూరులో జిల్లా కార్యాలయం ఏర్పాటుకు ఆదేశాలు రావడంతో అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల విభజన తర్వాత విద్యుత్ శాఖ పరిపాలన తిరుపతి కేంద్రంగా సాగుతోంది. గతంలో చిత్తూరు జిల్లాకు ఇన్‌చార్జి అధికారిని నియమించినా పాలనాపరంగా అధికారాలు లేవు. శాఖాపరంగా జిల్లాల విభజనపై గతంలో ప్రతిపాదన పెట్టారు. చిత్తూరులో ఏర్పాటుచేసే కార్యాలయానికి ఉన్న ఉద్యోగులనే సర్దుబాటు చేయనున్నారు. దీంతో తమపై మరింత పనిభారం పడుతుందని బేజారు పడుతున్నారు.

**విద్యుత్ శాఖ నేపథ్యం ఇలా..**

స్వాతంత్ర్యం తర్వాత ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు పేరు మీద విద్యుత్ శాఖ ఏర్పాటైంది. 1999లో ట్రాన్స్‌కో, జెన్‌కోగా విభజించారు. 2000లో ట్రాన్స్‌కో, 4 డిస్కంలుగా ఏర్పాటుచేశారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ ఏపీకి వచ్చాయి. అనంతరం 2019లో సీపీడీసీఎల్‌ను ఏర్పాటు చేశారు. తదుపరి జిల్లాల విభజన చేశాక నూతన సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పెట్టారు. తర్వాత ఎన్నికలు రావడంతో ఆ అంశం కార్యరూపం దాల్చలేదు. తిరుపతి కేంద్రంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల పాలన సాగుతోంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పీలేరు, మదనపల్లె, పుత్తూరు ఇలా మొత్తం 8 డివిజన్లు ఉన్నాయి. తిరుపతి కేంద్రంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పాలన సాగుతోంది. మూడు జిల్లాలకు ఒకే సర్కిల్ కార్యాలయం ఉండడంతో అధికారులపై ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు జిల్లా సమాచారం ఇన్‌చార్జి అధికారుల వద్ద లేకపోవడంతో కలెక్టర్ సమావేశాల్లో సందేహాలు అడిగితే తిరుపతి ఎస్ఈ కార్యాలయం నుంచి తెప్పించుకునే పరిస్థితి ఉంది. ఒకే సమయంలో మూడు జిల్లాల్లో ముఖ్య సమావేశాలు ఉంటే ఎస్ఈ ఏ ప్రాంతానికి వెళ్లాలో తెల్చుకోలేని పరిస్థితి. అంతేకాకుండా వినియోగదారులకు పలు విద్యుత్ సేవలు అందాలంటే తిరుపతికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో చెప్పలేని పరిస్థితి.


**55 పోస్టుల సర్దుబాటుతో పనిభారం**

కొత్తగా సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కానుండడంతో సంస్థపై భారం పడకుండా ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేయాలని ఆదేశాలొచ్చాయి. ఎస్ఈ-1, ఈఈ-3, డీఈ-6, ఏఈ-12, జేఈ-4, ఎస్ఏఓ-1, ఏఏఓ-1, జేఏఓ-5, పీఓ-1, ఎస్ఏ-11, జేఏ-9 మంది లెక్కన మొత్తం 55 మందిని సర్దుబాటు చేయనున్నారు. కొత్తగా పోస్టుల నియామకం లేకపోవడంతో సర్కిల్, కార్పొరేట్, డివిజన్ కార్యాలయ సిబ్బందినే సర్దుబాటు చేయనున్నారు. ఉదాహరణకు మీటర్స్, ప్రొటెక్షన్ విభాగానికి ఒక ఈఈ ఉండగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ విభాగాన్ని అందులో చేర్చనున్నారు. అంతేకాకుండా సాంకేతిక, వాణిజ్య, నిర్మాణ, అకౌంట్స్ విభాగాలకు ముగ్గురు ఈఈలు ఉన్నారు. ఆ సంఖ్యను కుదించి ఇద్దరు ఈఈలతోనే పర్యవేక్షణలో చేయించనున్నారు. డివిజన్ కార్యాలయాల్లోని సిబ్బందిని ఎస్ఈ కార్యాలయానికి వాడుకోనున్నారు. అప్పుడు డివిజన్ కార్యాలయాల్లో పనిభారం మరింత పెరుగుతుంది. కొత్త కార్యాలయంలో పాటు పనిభారం పెరుగుతుందని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. నెలలోపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పాలన ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్‌లో చిత్తూరు గాంధీ రోడ్డులోని డివిజన్ కార్యాలయాన్ని గిరింపేటకు మార్చే యోచనలో అధికారులు ఉన్నారు. అక్కడ సంస్థకు స్థలం ఉండడంతో విద్యుత్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంతంలో ఉంటే బాగుంటుందని భావిస్తున్నారు. అలాగే క్యాంపు కార్యాలయం కూడా పెట్టాలనే యోచనలో ఉన్నారు.

**సర్కిల్‌లో డివిజన్లు ఇలా**

చిత్తూరు సర్కిల్ పరిధిలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు డివిజన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పుత్తూరు డివిజన్‌లోని కొన్ని మండలాలు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉండగా వీటిని విభజించనున్నారు. అన్ని డివిజన్ల కంటే చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలోనే సెక్షన్లు తక్కువగా ఉన్నాయి. దీంతో చిత్తూరు అర్బన్ డివిజన్‌లోని పూతలపట్టు సెక్షన్‌ను రూరల్‌లో కలపడం లేదా రూరల్ డివిజన్‌ను అర్బన్‌లో విలీనం చేయడం అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

# దివంగతనేత వైఎస్సార్‌కు నివాళి



వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద ప్రత్యేక అలంకరణ



వైఎస్ఆర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న శశికళ, కుమార్ రాజా

వి.కోట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి ఆయన వీరాభిమాని, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శశికళ ఆదివారం నివాళులర్పించి, పిండ ప్రదానం చేశారు. ఆమె భర్త, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి కుమార్ రాజా వి.కోట పంచాయతీ 5వ వార్డు మెంబర్‌గా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పితృ పక్షాల్లో (పెద్దలకు పిండ ప్రదానం) భాగంగా తమ ప్రియతమ నేత వైఎస్.రాజశేఖరరెడ్డికి పిండ ప్రదానం చేస్తున్నామని తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి నిత్యమూ రాజశేఖరరెడ్డి ఫొటో దర్శనం అనంతరమే తమ పనులు మొదలు పెడతామన్నారు. వారు ఆయన ఫొటో పెట్టి పురోహితుడితో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. అనంతరం నివాళులర్పించి పిండ ప్రదానం చేశారు.